# ఆరో అనుభవం

"నాయనా కమలనయనం! మైథిలీ రామయ్యగారు వాళ్ళ పిల్లని చేసుకోమని రెండుసార్లు వచ్చార్రా! ఏం సమాధానం చెప్పాలో చెప్పేవు కావు" అంది కమలనయనం తల్లి.

పాతికేళ్ళ కమలనయనం ఓ బ్యాంకులో ఉద్యోగి పట్టభద్రుడు.

"నేను పెళ్ళంటూ చేసుకొంటే మైథిలీ రామయ్య గారమ్మాయినే చేసుకుంటానో మరే అమ్మాయిని చేసుకుంటానో ముందుగా చెప్పలేను. కాని నా నిర్ణయం తెల్పడానికి మరో మూడేళ్ళు టైమ్ కావాలమ్మా" అన్నాడు కమలనయనం.

"ఎందుకురా మరో మూడేళ్లు? చదువు పూర్తయింది. నిక్షేపంలాంటి బ్యాంకు ఉద్యోగం దొరికింధి. ఇహ పెళ్లి చేసుకుని నాక్కాస్త విశ్రాంతి ఇవ్వరా నాయనా!" బతిమిలాడింది తల్లి.

"మరో మూడేళ్లు ఓపిక పట్టమ్మా! కేంద్ర ప్రభుత్వం ఐ.ఏ.ఎస్. పరీక్ష రాయడానికి ఇరవై ఎనిమిదేళ్ళ వయసు వరకూ గడువిచ్చింది. ఇంతకుముందు ఇరవై ఐదేళ్ల వరకే వయఃపరిమితి ఉండేది. ఇప్పుడు మరో మూడేళ్లు పెంచారు. అంచేత ఈ మూడేళ్లూ నా అదృష్టం పరీక్షించు కుంటాను. పరీక్షలో నెగ్గినా నెగ్గకపోయినా ఇరవై ఎనిమిదేళ్లు పూర్తవగానే నీకు కోడల్ని తీసుకొచ్చి, నీకు విశ్రాంతి కలుగ జేస్తాను. అంతవరకూ ఓపిక పట్టమ్మా" అన్నాడు కమలనయనం.

ఇహ తల్లి కాదనలేక పోయింది.

కమలనయనం పని చేస్తున్న బ్యాంకులో మిత్రవింద అనే ఓ అందమైన అమ్మాయి జాయినయింది. ఆమె మరేదో బ్రాంచి నుంచి ట్రాన్స్ఫరయి వచ్చింది. తోటి గుమస్తాలుగా ఉన్న అందమైన అమ్మాయిల్ని ఎప్పుడూ కన్నెత్తి చూడలేదు కమలనయనం. కన్నెత్తి చూడకపోవడం అంటే చూడకపోవటం కాదు. భక్తుడైన ప్రహ్లాదుడు "కన్నుదోయికి అన్యకాంత లడ్డంబైన మాతృభావన చేసి మరలువాడు" అని పోతనామాత్యుడు వర్ణించినట్టు, తోటి ఉద్యోగినులను సోదరీమణులుగా భావించేవాడు. వాళ్లతో సోషల్‌గానే మూవ్ అవుతూ ఉండేవాడు.

అటువంటి కమలనయనం మిత్రవింద 'కుచోన్నతి'ని చూశాడు. ప్రబంధ కవులు వర్ణించిన 'సింహేంద్ర మధ్యమ'ను చూశాడు. 'మీన నేత్రాల్ని' చూశాడు. 'నీలవేణి'ని చూశాడు.

సతీదేవి దక్షుని యజ్ఞవాటికలో ఆత్మాహుతి చేసుకుని మళ్లీ పార్వతిగా పుట్టేక పరమశివుని భర్తగా పొందాలని కైలాసగిరిమీద, శివుని సేవలో నిమగ్నమైనప్పుడు, మన్మథుడు తనకున్న ఐదు పూలబాణాల్లోను ఒక బాణం విడిచిపెట్టాడు. త్రిమూర్తుల్ని, చక్రవర్తుల్ని మృగాక్షులకు దాసుల్నిగా చేసిన ఆ మన్మథుడికి అంజలి చేస్తాను అన్నాడు భర్తృహరి. తన బాణాలవల్లే కదా ఎంత ఉన్నతులైనా భార్యాదాసులై పోయారు?

ఆ మన్మథుడు రెండో బాణం తనమీదే విడిచి పెట్టినట్టు ఫీలయ్యాడు కమలనయనం. మిత్రవిందను చూడగానే ఒడలు జలదరించింది. ఇన్నాళ్లూ తనలో యౌవనం లేనట్టూ, ఇవాళే కొత్తగా యౌవనం మొలకెత్తినట్టూ అనిపించిందతనికి. సిద్ధమకరధ్వజం సేవించినట్లూ, చ్యవనప్రాశ అవలేహ్యం ఆస్వాదించినట్లూ అనిపించింది.

"హలో మిత్రవిందగారూ! నన్ను కమలనయనం అంటారు. నాగేళ్లయి ఈ బ్యాంకులో పనిచేస్తున్నాను. ఫైనల్ డిగ్రీ చదువుతుండగా బి.ఎస్.ఆర్.బి పరీక్ష రాశాను. డిగ్రీ పూర్తవగానే ఉద్యోగం వచ్చేసింది" తనను తాను పరిచయం చేసుకున్నాడు."

మిత్రవింద సీట్లోంచి లేచి సాదరంగా నమస్కరించింది.

"మిమ్మల్ని కలుసుకోవడం నాకెంతో ఆనందంగా ఉంది" అంది మిత్రవింద.

"నేను ఆ మాట అందామనుకున్నాను. నాకంటే ముందే ఆ మాట

అనేశారు. భలేవారండీ మీరు" అన్నాడు కమలనయనం చిరునగవులు చిందిస్తూ.

ఆః అనే వర్య ఆశ్చర్యమైంది. తోటి గుమస్తా సోదరులు సోదరీమణులు ఆశ్చర్యపోయారు!

ఒకనాడు మిత్రవింద వైట్ బ్లూసారీ మేచింగ్ బ్లౌజు ధరించింది. మేచింగ్ బొట్టు స్టిక్కరు నుదుట అంటించుకుంది.

రెండోరోజు గులాబీరంగుచీర, మేచింగ్ బ్లౌజ్ పీసు, గులాబీరంగు స్టిక్కరు బొట్టూ-

మూడోరోజు కాషాయవర్ణం చీర, మేచింగ్ బ్లౌజ్ పీసు, ఆ రంగు స్టిక్కరు బొట్టూ- పాశ్చాత్యపు అందగత్తెలు హరేకృష్ణ భజనలు చేస్తూ భారతదేశంలో విహరిస్తున్నట్టు అనిపించింది.

నాలుగోరోజు చిలకాకుపచ్చ రంగుచీర, మేచింగ్ బ్లౌజ్ పీసు, అదే రంగు స్టిక్కరు-

ఐదోరోజు పసుపు పచ్చరంగు చీర, బ్లౌజ్ పీసు, అదేరంగు స్టిక్కరు-

ఆరోరోజు ఊదారంగు చీర, మేచింగ్ బ్లౌజ్ పీసు, అదే రంగు స్టిక్కరు-

కమలనయనం పిచ్చెక్కిపోయాడు! కసి ఎక్కువైంది.

ఏడో రోజు రవివారం - అందరికీ సెలవు. సాయంత్రం కలర్ టీవీలో సినిమా చూస్తున్నంత సేపూ తన మిత్రవిందను ఆ సినిమా హీరోయిన్‌లో చూసి హెరాయిన్ సేవించిన వాడిలా అయిపోయాడు.

అబ్బాయిలోని పరధ్యానాన్ని బాగా గమనించింది తల్లి. తిండి తింటున్నంతసేపూ ఏదో సణుగుడు. డ్రామా రిహోర్సల్స్ వేసేటప్పుడు డైలాగులు వల్లెవేసుకుంటున్నట్టు ఏవో మాటలు!

తల్లికి కొంచెం ఆందోళన కలిగి, కుమారుని సహచరుడైన ఒక ఉద్యోగిని భోగట్టా చేసింది.

"మీవాడు లవ్‌లో పడ్డాడండి! అంతకన్నా మరేంలేదు. మిత్రవింద అనే అందమైన అమ్మాయి ఈ మధ్యనే మా బ్యాంకులో జాయినయింది. ఆమెను చూడకుండా క్షణం కూడా ఉండలేక పోతున్నాడు. ఇద్దరూ అదే పనిగా గుసగుసలు. తొందరగా ఆ అమ్మాయితోనే పెళ్లి జరిపించేయండి!" అని ఉచితంగా ఓ సలహా పారేశాడు మిత్రుడు.

"మూడేళ్లపాటు ఆ ప్రస్తావన తేవొద్దన్నాడు బాబూ మావాడు. ఐఏఎస్ పరీక్షకి వెళ్లడానికి ఇరవై ఎనిమిదేళ్ల వయసు వరకూ కేంద్ర ప్రభుత్వం అనుమతించిందట కదా? ఆ పరీక్షకు హాజరవడానికి కష్టపడి చదవాలి. అంతవరకూ తన పెళ్లి విషయంలో ఒత్తిడి తేవద్దన్నాడు. ఏం చెయ్యడం?" అంది కమలనయనం తల్లి.

"అది ఆనాటి మాట. ఇవాళ అడిగి చూడండి మీ వాణ్ణి. ఏమంటాడో?' అన్నాడు కమలనయనం మిత్రుడు.

"నిజమేనమ్మా! నేను మిత్రవిందని చూడకుండా ఉండలేకపోతున్నాను" తన సహోద్యోగి యింట్లో అడుగుపెడుతూ అన్నాడు కమలనయనం.

"కాని అబ్బాయ్! మూడేళ్ల వరకూ చేసుకోనన్నావు గదర్రా!"

"పెళ్లి చేసుకుని ఉద్యోగం చేసుకుంటూ, పిల్లల్ని కంటూ కూడా చదువుకున్న వాళ్లు ఎంతమంది లేరు? అలాగే పెళ్లి చేసుకున్నాక ఐఏఎస్‌కి వెళతానమ్మా!"

"ఉద్యోగం చేస్తున్న అమ్మాయిని చేసుకుంటే నాకేమిట్రా సుఖం నాయనా? ఇప్పుడు నీకొక్కడికే వండుతున్నాను. అప్పుడు మీ యిద్దరికీ వండాలి! రాను రాను పెద్దదాన్నవుతున్నానా? చిన్నదాన్నవుతున్నానా?"

"నీకే యిబ్బందీ రాకుండా చూస్తానమ్మా! వంట మనిషిని పెట్టుకుందాం!" - అన్నాడు కమలనయనం.

"సరే అయితే. ఆ అమ్మాయిని కనుక్కో. వాళ్ల పెద్దవాళ్లను రమ్మను మాట్లాడుకుందికి" అంది తల్లి.

"మా మంచి అమ్మ!" అంటూ కమలనయనం తల్లిని బుజ్జగించాడు.

కమలనయనం మిత్రవిందతో డైరెక్టుగా తన పెళ్లి విషయం మాట్లాడలేక తన సహోద్యోగితో చెప్పాడు. అతను మిత్రవిందను కలసి "మిత్రవిందగారూ! సాయంత్రం ఆఫీస్ అయిపోయేక మీతో కొన్ని ముఖ్యమైన విషయాలు మాట్లాడాలి." అన్నాడు.

"ఓ తప్పకుండా! అలాగే కలుద్దాం" అంది మిత్రవింద.

సాయంత్రం మిత్రవిందకీ కమలనయనానికీ ఇంటర్‌వ్యూ ఏర్పాటు చేశాడు మిత్రశ్రీ. మిగిలిన స్టాఫంతా వెళ్ళిపోయారు.

"మరేం లేదు మిత్రవిందగారూ! మావాడు మిమ్మల్ని జీవిత భాగస్వామిగా చేసుకోవాలను కుంటున్నాడు. మీ అభిప్రాయం తెలుసుకుందామని..." అన్నాడు మిత్రశ్రీ.

"నాకేం అభ్యంతరం లేదు ఆయన్ను వివాహం చేసుకుందికి" అని మొహమాటం లేకుండా చాలా ఈజీగా అనేసింది మిత్రవింద.

కమలనయనం మెలికలు తిరిగిపోయాడు. కాటాలో వెయ్యకుండానే రొండందలు కేజీలు బరువెక్కి వుంటాడని ఎవ్వరైనా ఊహించవచ్చు.

"కానీ..." అని మూడు చుక్కలు పెట్టింది మిత్రవింద.

ఇంకేం అడ్డు చెప్తుందో అని గాభరా పడ్డాడు కమలనయనం.

"పెళ్లి అంటే కూర వండేసుకోడం కాదు కదండీ! ఎన్నో వ్యక్తిగత విషయాలు, సమస్యలు ఉంటాయి. అవి మనసు విప్పి మాట్లాడుకోవాలి. ఉభయులకీ అవి ఆమోదం అయినప్పుడే మనం ముందుకి నడవాలి" అంది మిత్రవింద.

"దానికి మావాడెప్పుడూ సిద్ధమే. ఏంరా చెప్పవేం?" అన్నాడు మోడరేటర్ అయిన మిత్రశ్రీ.

"ఓయస్ రెడీ!" అన్నాడు కమలనయనం హుషారుగా.

"అయితే మీ వ్యక్తిగత విషయాలు ముందు చెప్పండి" అంది మిత్రవింద.

"నాకు తండ్రిలేడు. మా చెల్లిపుట్టేక చనిపోయార్ట మా నాన్న. మా అమ్మే నాకు మా చెల్లికీ తండ్రి. మా చెల్లికి పెళ్లయి కాపురానికి వెళ్ళిపోయింది. మాకు సొంతిల్లుంది. మడీ మాన్యాలు ఏమీ లేవు. అంతకన్నా ఆస్తి నాస్తి. అప్పు లేకపోవడమే ఆస్తి!" అన్నాడు కమలనయనం.

మిత్రవింద వంతు వచ్చింది. మొహమాటం లేకుండా ఫ్రీగా, ఈజీగా మాట్లాడే మిత్రవింద, తన విషయం చెప్పడానికి కొంచెం తటపటాయించింది.

"నాకు వివాహమైన ఐదేళ్లకి నా భర్త చనిపోయారు. నేను వితంతువుని!" అని మెల్లగా అంది మిత్రవింద.

అంతే! ధామ్మని బాంబు పేలినట్టయింది కమలనయనం మెదడులో! గంటకి 6,400 కిలోమీటర్ల వేగంతో భూమి తన చుట్టూ తాను తిరుగుతూంటే ఇన్నాళ్లూ మనం ఆ విషయాన్ని మరచిపోయి ఇవాళ మాత్రం అలా భూమి జోరుగా తిరుగుతున్న అనుభూతిని పొందేడు కమలనయనం. చివాలున లేచిపోయి

తూలుతూ ఇల్లు చేరేడు.

"అమ్మా! నేనిప్పట్నుంచీ పెళ్లి చేసుకోను. నా ఐఏయస్ పరీక్షలు పూర్తవ్వాలి" అన్నాడు దేవదాసులా భగ్నప్రేమికుడై.

కుమారునిలోని ఈ మార్పుకి కారణం ఊహించలేక పోయింది తల్లి.

"నీ యిష్టంరా నాయనా!" అనేసింది తల్లి.

❁ ❁ ❁

మర్నాడు యథావిధిగా ఆఫీసుకెళ్లాడు కమలనయనం. మిత్రవిందను కళ్లెత్తి చూడలేక, తల దించుకుని పని చేసుకుంటున్నాడు.

మిత్రవింద మాత్రం మామూలుగా హుషారుగానే వుంది. ఈ ప్రేమ వైఫల్యం వల్ల తానేమీ క్రుంగిపోలేదు. చెక్కు చెదరలేదు. ఎందుకంటే ఆమెకిది ఆరో అనుభవం!

• ఆంధ్రప్రభ వీక్లీ •

*12-6-1991*